క్లుప్తంగా

మత్తడి వద్ద వల ఏర్పాటుకు నిధులు మంజూరు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి గ్రామాల మధ్యన ఉన్న సంగోజీపేట చెరువు మత్తడి వద్ద చేపలు బయటకు వెళ్లకుండా ఉండేదుకు వల కోసం ఇందుర్తి 2 ఎంపీటీసీ కోమటిరెడ్డి చంద్రకళరాంగోపాల్‌రెడ్డి తన కోటా నుంచి రూ. రెండు లక్షలు మంజూరు చేశారు. సోమవారం చెరువుకట్ట వద్ద భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు సన్నీళ్ల వెంకటేశం, గునుకుల అమూల్య, మాజీ ఉపసర్పంచులు అన్నాది మల్లికార్జునరెడ్డి, కూన పోచయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంగోజీపేట చెరువును పరిశీలించిన అధికారులు



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామం సంగోజీపేట చెరువును ఇరిగేషన్ అధికారులు సోమవారం సందర్శించారు. 'తూము లీకేజీతో నష్టం' అనే కథనం జూన్ 30న 'సాక్షి'లో ప్రచురితమైంది. కథనానికి స్పందించిన ఐబీ డీఈఈ చైతన్య, ఇతర అధికారులు తూము, కట్టను పరిశీలించారు. ఈసందర్భంగా డీఈఈ చైతన్య మాట్లాడుతూ.. తూము లీకేజీని అరికట్టేందుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపామని, ఇప్పటికే తాత్కాలిక మరమ్మతులు చేపట్టామన్నారు. అలాగే మత్తడి వద్ద ఎలాంటి పిల్లర్ల నిర్మాణం చేపట్టవద్దన్నారు.

ముదిరాజ్ మహాసభ యూత్ జిల్లా అధ్యక్షుడిగా సురేశ్



నియామకపత్రం స్వీకరిస్తున్న సురేశ్

శంకరపట్నం: ముదిరాజ్ మహాసభ యూత్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి సురేశ్‌ను నియమించినట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం తెలిపారు. నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్ అందజేశారు. నియామకానికి కృషి చేసిన యువత రాష్ట్ర అధ్యక్షుడు బాలుకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ధర్మరాజ్‌పల్లి పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, విధులకు హాజరు కావడం లేదని కాంగ్రెస్ నాయకుడు టీకుల శ్రావణ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ పనులు పక్కన పెట్టి సొంత పనులు చేసుకుంటున్నాడని ఫిర్యాదులో ఆరోపించారు. కార్యదర్శిపై తగు విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జావిద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల, పాఠశాలల రేషనలైజేషన్ ఉండదని చెప్పిన అధికారులు ఉపాధ్యాయుల ట్రాన్స్‌ఫర్ సమయంలో హఠాత్తుగా పాత నిబంధనలు, జీవో నం.17 ముందుకు తెచ్చి ఇంటర్నల్ రేషనలైజేషన్ ప్రక్రియ ప్రారంభించడం అసంబద్ధమైన చర్య అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున మౌలిక సదుపాయాలు కల్పించి, అవసరమైన మేరకు విద్యా వలంటీర్లను నియమించి పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిలుపుదలకు ప్రయత్నించాలని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాల్సిన తరుణంలో రేషనలైజేషన్ పేరుతో ఎస్‌జీటీలను ఇబ్బంది పెట్టకుండా,బదిలీ అయిన అందరినీ రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలి

విద్యానగర్: ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం ఇవ్వాలని కరీంనగర్ కురుమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్రె పావని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కురుమలు రాజకీయంగా రాణించలేని పరిస్థితుల్లో ఉన్నప్పటికీ స్వయం కృషితో, ప్రజాభిమానంతో ఆలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన ఐలయ్యకు బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో కురుమ సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పెద్ది అనిత, సభ్యులు రమ్య, అంజలి, మేకల దేవిక, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది వదలక.. వేరేది చేయక

- ఇబ్బందులు పడుతున్న పంచాయతీకార్మికులు, సిబ్బంది
- ఆరునెలలుగా అందని వేతనాలు



గాగిరెడ్డిపల్లి గ్రామంలో వీధులు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వేరే పని చేయలేక ఉన్న పని వదిలిపెట్టలేక మనోవేదనకు గురవుతున్నారు. గాగిరెడ్డిపల్లి జీపీ పరిధిలో బరిగెలపల్లె, బొల్లోనిపల్లె గ్రామాలున్నాయి. ఈగ్రామాల్లో 1,614 మంది జనాభా, 1,350 మంది ఓటర్లు ఉన్నారు. జనాభా ప్రాతిపదికన నలుగురు వర్కర్లు పనిచేయాల్సి ఉండగా ఒకరు ఎక్కువగా ఉన్నారు. వీరందరికి ప్రతి నెల రూ.47,500 చెల్లిస్తున్నారు. మురుగుకాల్వలు, వీధులను శుభ్రం చేయడం, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో తరలించడం లాంటి పనులు చేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామ పంచాయతీకి సంవత్సరానికి వేలల్లో ఆదాయం వస్తుంది. ఐదేండ్లుగా జీపీ పాలకవర్గం, సర్పంచ్ వారి జీతభత్యాలు చూసుకునేవారు. వారి పదవీకాలం పూర్తయినప్పటి నుంచి వేతనాలు రావడం లేదని కార్మికులు, సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు చెల్లించేలా చూడాలని కోరుతున్నారు. లేదంటే పారిశుధ్య పనులు నిర్వహించమని హెచ్చరిస్తున్నారు. విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్‌ను వివరణ కోరగా ఆరు నెలల వేతనాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ



మానకొండూర్: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



జమ్మికుంట: సమావేశంలో అధికారులు, చైర్మన్, అతిథులు, డైరెక్టర్లు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతులకు సూచనలు, అభిప్రాయాలను తెలియపరిచేందుకు వ్యవసాయశాఖాధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి స్వీకరించిన అభిప్రాయాలను, విజ్ఞప్తులను ప్రభుత్వానికి అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాధకిషన్‌రావు, ఏఈఓ శ్రీనివాస్, రిజిస్ట్రార్ కిరణ్ కుమార్, అనంత రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, సీఈఓ రామయ్యపాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట రైతువేదికలో సోమవారం జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ అధ్యక్షతన, పీఏసీఎస్ సీఈవో రవీందర్ ఆధ్వర్యంలో రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొందరు రైతులు పదెకరాల వరకు ఉన్నవారికి రైతుభరోసా అందించాలని తెలిపారు. ఐటీ రిటర్న్స్‌తో సంబంధం లేకుండా సాగులో ఉన్న భూమికే ఇవ్వాలన్నారు. అభిప్రాయ సేకరణకు జిల్లా ప్రత్యేక అధికారి అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు రైతుల సూచనలు, సలహాలను రికార్డు చేసుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, ఏఈవో లక్ష్మణ్, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధి ధర్మారం పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన, సీఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మనోజ్‌కుమార్, వైస్ చైర్మన్ మేడిపల్లి మొగిలి, పాలక వర్గం, రైతులు పాల్గొన్నారు.

3న రైతులతో సమావేశం

చిగురుమామిడి: చిగురుమామిడి రైతువేదికలో 3న రైతు భరోసా పథకంపై సలహాలు సూచనల కోసం రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కేడీసీసీ అధికారుల ఆదేశాలతో ఈ సమావేశం నిర్వహిసున్నామని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



గంజాయి, సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు శ్రీరాములపల్లి గ్రామంలో జమ్మికుంటరూరల్ సీఐ కె.కిషోర్ సోమవారం ప్రజలతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ..యువత మంచి లక్షణాలతో ముందుకుసాగాలని, గంజాయి, మద్యపానం వంటి వ్యాసనాలకు బానిసలుకావొద్దని, సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సై రాజ్‌కుమార్, గ్రామస్తులుపాల్గొన్నారు.

డ్రగ్స్ ఆరోగ్యానికి హానికరం

డ్రగ్స్ ఆరోగ్యానికి హానికరమని సీఐ అన్నారు. మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు యాంటీడ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ...డ్రగ్స్‌కు బానిసైనవారు ఎంతటి అకృత్యాలు, నేరాలు చేయడానికైనా వెనుకాడరని, పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన పోలీసులకు సమాచారం అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైరాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సభ

జమ్మికుంట: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భీమేశ్ సోమవారం ప్రటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు ఇది చివరి సమావేశమని, సభ్యులకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఉంటుందని, సభ్యులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు.

సన్మానం



బి.వి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సజ్జద్

జమ్మికుంట: హుజూరాబాద్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, జమ్మికుంట పట్టణానికి చెందిన మహమ్మద్ సజ్జద్ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ. శ్రీనివాస్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, తదితరులు ఉన్నారు.

టేలాల తొలగింపులో ఉద్రిక్తత

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో రోడ్డు పక్కన షాపులు, టేలాలను జీపీ అధికారులు సోమవారం తొలగించడం ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలో ఇటీవల ట్యాంకర్ బోల్తాపడి ఇద్దరు మృతి చెందగా, మరో ప్రమాదంలో టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనలు తెలిసిందే. రహదారిని ఆనుకుని ఉన్న టేలాలను, సామాన్లను ట్రాక్టర్లలో తరలించారు. టేలాలను తొలగించొద్దంటూ చిరువ్యాపారులు రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఎస్సై లక్ష్మారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. నెలరోజుల క్రితం పంచాయతీ సిబ్బంది వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఎంపీఓ బషీరొద్దీన్ టేలాలను తొలగించడంతో అధికారులకు, చిరువ్యాపారుల మధ్య వా గ్వావాదం జరిగింది. నోటీసుల అనంతరం వేచి చూసి టేలాలను తొలగించామని ఎంపీఓ తెలిపారు.



జేసీబీతో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన షాపులు, టేలాలను తొలగిస్తున్న అధికారులు

పనులు పూర్తి చేయండి



శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో మహిళా సంఘం భవనం నిర్మాణం నిధుల కొరతతో అసంపూర్తిగా మిగిలిపోయింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.నాలుగు లక్షల నిధులు మంజూరు చేయగా సిమెంట్ పనులు, తలుపులు, కిటికీలు బిగించారు కానీ భవనానికి రంగులు వేయకపోవడం, ప్రహరీ నిర్మించకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అసంపూర్తి పనులు పూర్తి చేయాలని మహిళలు కోరుతున్నారు.

స్లమ్ ఏరియాలకు స్మార్ట్ సిటీ వర్తించదా?

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని స్లమ్ ఏరియాలకు స్మార్ట్ సిటీ వర్తించదా అని కాంగ్రెస్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ ప్రశ్నించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, స్మార్ట్ సిటీ గడువు పొడగించడం వల్ల ఎవరికి ప్రయోజనమని, సామాన్య ప్రజలకు స్మార్ట్ సిటీ నిధులు ఉపయోగపడడం లేదన్నారు. స్మార్ట్ సిటీ పైన పటారం, లోన లొటారంలా మారిందని విమర్శించారు. బయటి నుంచి వచ్చే వాళ్లను ఆకర్షించేలా మెయిన్ రోడ్లు, జంక్షన్లు సుందరంగా తీర్చిదిద్దారని, కాని నగరంలో ఉన్న స్లమ్, లోతట్టు డివిజన్‌లలో కనీస అభివృద్ధి పనులు కూడా చేపట్టడం లేదని ఆవేదన చెందారు. స్మార్ట్ సిటీ కింద కరీంనగర్ ఎంపికైనప్పుడు ప్రజలు ఎంత సంతోషపడ్డారో ఇప్పుడు అంతకంటే ఎక్కువగా బాధ పడుతున్నారన్నారు. స్మార్ట్ సిటీ నిధులను ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పక్కదోవ పట్టించారన్నారు. అవసరమైన చోట పనులు చేపట్టకుండా కేవలం కమీషన్ల కోసమే పనులు చేసి జేబులు నింపుకున్నారని ఆరోపించారు. 44వ డివిజన్‌లో శ్రీదేవి హాస్పిటల్ నుంచి సాయినగర్ మీదుగా వెళ్లే నాలా శిథిలావస్థకు చేరినా నిర్మాణం చేయలేదన్నారు. డ్రైనేజీ కూలడంతో మురికినీళ్లు ఇండ్లలోకి చేరుతున్నాయన్నారు. ఇలాంటి సమస్యలు అధికంగా ఉన్న నగరంలోని స్లమ్, లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించ లేదన్నారు. నగర ప్రజలకు అవసరమైన డివిజన్లలో స్మార్ట్ సిటీ నిధులు పెట్టలేదన్నారు. పనుల్లో జరిగిన అవినీతిపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నా రు. కానీ, విచారణ భయంతో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఎంబీలు మాయం చేస్తున్నారని, క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్థికంగా ఎదిగిన కులాలను బీసీ-ఏలో చేర్చొద్దు

కరీంనగర్‌టౌన్: ఆర్థికంగా ఎదిగిన కులాలను అణగారిన కులాలకు చెందిన బీసీ-ఏలో చేర్చవద్దని రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీసీ-ఏ కులాల పరిరక్షణ సమితి సమావేశానికి హాజరై మాట్లాడారు. బీసీ-ఏ లో ఇతర కులాలను చేర్చవద్దని 2008 సంవత్సరం నుంచి పోరాటం చేస్తున్నామని, హైకోర్టు కూడా ఇతర కులాలను చేర్చవద్దని తీర్పు ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ బీసీ-ఏలో ఇతర కులాలను చేర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సూచించారు. రాజకీయాల కోసం రిజర్వేషన్లు మారిస్తే అణగారిన కులాల్లో ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. సమావేశంలో నాయకులు నర్సింహులు, శంకర్, శ్వేత, శ్రీహరి, సుధాకర్, కొమురయ్య, గోపాల్, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఘన సన్మానం





రామడుగులో పోస్టుమెన్ శేఖర్, గంగాధరలో డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చొప్పదండి: చొప్పదండి మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మల్లేశం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే నిర్వహించారు. చొప్పదండి పీహెచ్‌సీలో రాజేశ్, రమణరావు, సమీనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి క్యాషియర్ నలుమాచు శ్రీదర్, ఈ. శ్రీనివాస్, ఎస్. రామస్వామి, పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు. చొప్పదండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ధర్మరాజు పవార్ ఆసుపత్రిలో వైద్యులను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం కొల్లూరి జితేందర్, దోస రాము తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలో డాక్టర్స్, జాతీయ పోస్టల్ ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా సోమవారం గోపాల్‌రావుపేట లయన్స్ క్లబ్, యువజన సంఘాల ప్రతినిధులు వైద్యాధికారులు, పోస్టల్ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. రామడుగులో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య ఆధ్వర్యంలో వైద్యాధికారితో పాటుగా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, జిల్లా పద్మశాలీ యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొలిపాక కమలాకర్, లయన్స్ క్లబ్ సెక్రటరీ రాంపల్లి శ్రీనివాస్, కోశాధికారి పాకాల మోహన్, కర్ర శ్యాంసుందర్‌రెడ్డి, కొడిమ్యాల వెంకటరమణ, చాడ దామోదర్‌రెడ్డి, కోట్ల మల్లేశం, ముదగంటి రాజిరెడ్డి, యువజన సంఘాల ప్రతినిధులు బుదారపు కార్తిక్, గంగారాజు, ప్రవీణ్, అజయ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉద్యోగులను సోమవారం ఘనంగా సన్మానించారు. గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు ప్రియాంక, శ్రావణి, పోస్టాఫీసులో సిబ్బందిని శాలువాలు సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరాం శ్రవణ్, పోలు సమ్మయ్య, వడ్లకొండ బుచ్చిరాములు, పర్రెం లక్ష్మారెడ్డి,ఉడుత శ్రీనివాస్, ఆల్ల విజయేందర్‌రెడ్డి,రావుల సతీష్,కమటం అనిల్ తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: డాక్టర్లను సన్మానిస్తున్న ఆర్‌ఎంపీలు,



రామడుగులో యువజన సంఘాల ప్రతినిధులు

మంత్రి 'పొన్నం'ను కలిసిన ఎంపీటీసీలు



మంత్రి పొన్నంతో మాట్లాడుతున్న ఎంపీటీసీలు

చిగురుమామిడి: చిగురుమామిడి మండల సర్వసభ్య సమావేశం 3న నిర్వహించనున్నామని, సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఎంపీటీసీలతో కలిశారు. ఈసందర్భంగా మండలంలోని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమావేశానికి హాజరవుతానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు భేతి రాజిరెడ్డి, ఎంపీటీసీలు మిట్టపల్లి మల్లేశం, మేడబోయిన తిరుపతి, అందె స్వప్న, కొత్తూరి సంధ్య, పెసరి జమున, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, పెసరి రాజేశం ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో జ్యోతిష్మతి చైర్మన్ దంపతులు జువ్వాడి విజయ సాగర్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు

తిమ్మాపూర్: మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) కళాశాల ఆవరణలోని సాయిబాబా ఆలయం తొమ్మిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు సాయిబాబాకు అభిషేకం, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పూలు, మామిడి, అరటి ఆకులతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం రంగులమయంగా చేశారు. మధ్యాహ్న హారతిలో జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, చైర్‌పర్సన్ జువ్వాడి విజయ, సెక్రెటరీ, కరెస్పాండెంట్ సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్.రావు, డీన్ అకాడమిక్ డాక్టర్ కె.వైశాలి వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, స్వీట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



పుస్తకాలతో ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్, హెచ్‌ఎం ఉమారాణి, విద్యార్థులు

తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి హిందీ టీచర్ షరీఫ్ అహ్మద్ ఉన్నతి కార్యక్రమంలో భాగంగా రూ.5 వేల విలువైన పుస్తకాలను సోమవారం గ్రంథాలయానికి అందజేశారు. పిల్లల కథలు, హిందీ సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలున్నాయి. ఈసందర్భంగా హెచ్‌ఎం ఉమారాణి మాట్లాడుతూ... పుస్తక పఠనం ద్వారా పిల్లలు పరిపూర్ణవంతులవుతారని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం షరీఫ్ అహ్మద్ మాట్లాడారు. చదువుతోపాటు పిల్లల్లో సంస్కారం పెంపొందుతుందని, సమాజంలో వారికి గౌరవం లభిస్తుందన్నారు. పిల్లల పఠనాభివృద్ధితోపాటు వారిలో విజ్ఞానాన్ని పెంపొందించడానికి పుస్తకాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, చక్రధర్, సయ్యద్ షఫిక్, డి. శ్రీనివాసరెడ్డి, జి.రాజేశం, తదితరులు పాల్గొన్నారు.